మైనర్ల దూకుడు.. తల్లిదండ్రులకు శోకం



ద్విచక్రవాహనం నడుపుతున్న మైనర్

- ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్తున్న బాలలు
- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.. బైక్‌లను నియంత్రించే శక్తి లేకున్నా..
- అతివేగంతో వెళ్తూ ప్రమాదాలపాలు
- తల్లిదండ్రులు, పోలీసులు దృష్టి సారిస్తేనే భద్రత



నార్తుమోపూరు వద్ద గేదెను ఢీకొని మృత్యువాత పడిన బాలుడు(ఫైల్)

అల్లూరు: ఏ తల్లిదండ్రులకైనా పిల్లలే సర్వస్వం. వారిపై అతిప్రేమో..అవగాహన రాహిత్యమో గానీ మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తూ సంబరపడిపోతున్నారు. కంటిపాపల్లా కాపాడుకోవాల్సిన బాలలను ప్రమాదంలో పడేయడంతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు.

రయ్...రయ్ మంటూ

ఇటీవల కాలంలో మైనర్లు ఎక్కడ చూసిన రయ్.. రయ్ మంటూ బైకులపై దూసుకుపోతున్నారు. పిల్లలకు ఎలాంటి లోటు రానివ్వకూడదనే అత్యుత్సాహంతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇస్తున్నారు. ద్విచక్ర వాహనాలను నడపడం నేర్పించడంతో పాటు వారే స్వయంగా వాహనాన్ని నడిపేలా పోత్సహించడం ప్రమాదాలకు కారణంగా మారుతోంది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో మైనర్లు బైకులను తీసుకెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన..వాహనాలను నియంత్రించే శక్తి లేకపోవడం వల్ల మైనర్లు రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ఘటనల్లో కొందరు మైనర్లు గాయాలతో బయటపడుతుండగా..మరి కొందరు శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు. మరికొన్ని ఘటనల్లో ప్రాణాలను కోల్పోతూ కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నారు. మైనర్ల నిర్లక్ష్యానికి ఎదుటి వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నా..

మోటార్ వాహన చట్ట నిబంధనలు కఠినంగా ఉన్నా క్షేత్రస్థాయిలో అమల్లో మాత్రం నీరుగారుతోంది. పిల్లలు వాహనాలు నడుపుతుంటే చూసి ముచ్చటపడే కుటుంబ సభ్యులు ఉన్నారే తప్ప వద్దని వారించే వారు చాలా తక్కువ. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడుపుతూ తరచూ పోలీసులకు పట్టుబడుతున్నారంటే పరిస్థితిని తీవ్రత అంచనా వేయవచ్చు. పోలీసులు తరచూ వాహనాల తనిఖీలు చేస్తూ పట్టుబడిన వారికి అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనాలను నడుపరాదని, ఎవరైనా పట్టుబడితే సంబంధిత వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వాహన యజమానులతో పాటు మైనర్ల కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు.

చట్టప్రకారం..

మోటార్ వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపరాదు. 18 ఏళ్లు నిండిన తరువాతే వాహనాలు నడిపేందుకు చట్టం అంగీకరిస్తుంది. అర్హత ఉన్న వారికి రవాణా శాఖ ఆధ్వర్యంలో తగిన పరీక్షలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్సు జారీ చేస్తారు. మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే చట్టపరంగా శిక్షకు అర్హుడే. అదే సమయంలో వాహన యజమానిపైనా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

కొన్ని ప్రమాద ఘటనలు

ఇటీవల కాలంలో మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మైనర్లు మృత్యువాత పడ్డారు. మరో 25 మందికిపైగా చిన్నారులు గాయాలపాలవడం ఆందోళనను కలిగిస్తోంది.

- ఇటీవల నార్తుమోపూరుకు చెందిన మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ గేదెలను ఢీకొని మృతి చెందాడు.
- ఇటీవల నార్తుఆములూరుకు చెందిన మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొని మృత్యువుపాలయ్యాడు.
- మరికొన్ని ప్రమాద ఘటనల్లో కాళ్లు, చేతులు విరిగి చిన్నారులు మంచాన పడ్డారు. అయినా మైనర్లు మాత్రం ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ ఎదురుగా వచ్చే వారిని భయభ్రాంతులను గురి చేస్తున్నారు. ఇప్పటికైనా మైనర్ల తల్లిదండ్రులు ఆలోచించి వాహనాలను ఇవ్వకుండా ఉంటే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

తల్లిదండ్రులదే బాధ్యత



మోటార్ వాహన చట్ట ప్రకారం 18 ఏళ్లు దాటిన వ్యక్తి కూడా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదు. మైనర్లు వాహనాలను నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవు. మైనర్ల బాధ్యత తల్లిదండ్రులదే. తగిన వయస్సు వచ్చేంతవరకు పిల్లలకు డ్రైవింగ్ నేర్పించకూడదు. చిన్నతనంలోనే ఖరీదైన వాహనాలను ఇస్తుండడంతో అధిక శాతం మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

–కిషోర్‌బాబు, ఎస్సై, అల్లూరు

మైనర్లను ప్రోత్సహించరాదు



మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారినపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇటీవల మైనర్లు గాయాలతో ఆస్పత్రికి వస్తున్న ఘటనలు అధికంగా ఉన్నాయి. నాలుగు నెలల వ్యవధిలో దాదాపు 25 మంది వరకు గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. పరిస్థితి తీవ్రతను తల్లిదండ్రులు అర్థం చేసుకుని మైనర్లను ప్రోత్సహించరాదు.

–వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, అల్లూరు ప్రభుత్వాస్పత్రి

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు జీ ప్రసాద్, జీ సుధాకర్, పెంచలరత్నం, మధు, రమణయ్య, నాగమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

వరికుంటపాడు/సీతారామపురం: వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లోని పశువులకు ఈ నెల 31వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నట్లు ఆయా మండలాల పశు వైద్యాధికారులు ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ, అనూష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి పశువులకు గాలికుంటు సోకితే పాలఉత్పత్తి తగ్గడమే కాకుండా పాలు తాగిన లేగ దూడలు మరణించే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు గ్రామాల్లోని పశు సంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించి తమ పశువులకు టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీతారామపురం విద్యార్థులు



సీతారామపురం: స్థానిక కోటవీధిలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ షేక్ ముజీబా తబస్సుమ్ ఆదివారం తెలిపారు ఆన్‌లైన్ వేదికగా జిల్లాస్థాయిలో నిర్వహించిన విభా వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ పోటీల్లో 3వ తరగతి విద్యార్థి షేక్ అలీఅల్ఫాజ్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అలాగే సయ్యద్ మహమ్మద్ సాఫీర్, పాలిశెట్టి శరణ్యలు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గైడ్‌టీచర్ ముజీబాతబస్సుమ్‌తో పాటు ప్రతిభచాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బొమ్మిరెడ్డి నియామకంపై హర్షం



బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డికి మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, చేజర్లకు చెందిన యర్రగుంట పెంచలయ్య, తదితరులు ఆదివారం అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిరంతరం పాటుపడే బొమ్మిరెడ్డిపై నమ్మకంతో ఆయనకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పదవీబాధ్యతలు అప్పగించడం సరైన నిర్ణయమని కొనియాడారు.

వాహనాల తనిఖీ



చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి-చిత్తలూరు రోడ్డులో ఎస్సై తిరుమలరావు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్, వాహన లైసెన్సులు, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలి

సోమశిల: పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి సూచించారు. అనంతసాగరం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పదోతరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. గత ఆదివారం కంటే 30శాతం అధికంగా విద్యార్థులు హాజరుకావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులను పంపేలా చూడాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో దివ్యాంగులకు రాయితీలు

సీతారామపురం : జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్ బోర్డు పలు రాయితీలు, సౌలభ్యాలను కల్పించింది. విద్యార్థులు తమ వైకల్యాన్ని ధ్రువీకరించే పత్రాలు సమర్పించి వీటిని పొందవచ్చు. ప్రభుత్వం సదరం క్యాంపుల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని జనరల్ ఆస్పత్రులు, వైకల్యానికి సంబంధించి మెరుగైన చికిత్స అందించే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో జారీ చేసే వైకల్య ధ్రువీకరణ పత్రాలను ముందుగా ఇంటర్‌బోర్డుకు సమర్పించి అనుమతి పొందాలి. జిల్లాలో 116 మంది విద్యార్థులు రాయితీలు పొందేందుకు అర్హులయ్యారు.

రాయితీలు ఇలా..

దివ్యాంగ విద్యార్థులు స్వయంగా పరీక్ష రాయలేకపోతే పరీక్ష రాసేందుకు (స్క్రైబ్)ను ఏర్పాటు చేస్తారు. స్వయంగా పరీక్ష రాసుకునే వారికి గంటకు 20 నిమిషాలు అదనపు సమయం కేటాయిస్తారు. 3.15 గంటలు జరిగే పరీక్షకు 65 నిమిషాలు, 3 గంటలు జరిగే పరీక్షకు ఒక గంట, 2.45 గంటలు జరిగే పరీక్షకు 55 నిమిషాలు, 2.30 గంటలు జరిగే పరీక్షకు 50 నిమిషాలు, 2 గంటలు జరిగే పరీక్షకు 45 నిమిషాలు, 1.45 గంటల పరీక్షకు 35 నిమిషాలు, 1.30 గంటల పరీక్షకు 30 నిమిషాలు, ఒక గంట జరిగే పరీక్షకు 20 నిమిషాలు అదనంగా సమయం ఇస్తారు. శారీరక వైకల్యం ఉన్న విద్యార్థులకు స్క్రైబ్‌ను ఇవ్వడంతో పాటు పరీక్ష రాసేందుకు అదనపు సమయం కూడా కేటాయిస్తారు. పరీక్షల్లో కనీసం 35 శాతానికి బదులుగా 10 శాతం మార్కులు సాధించిన వారు ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారు. మూడు భాషల్లో ఒక పరీక్షకు మినహాయింపు ఇస్తారు. అలాగే దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 20 శాతానికి తగ్గించారు. మూల్యాంకన సమయంలో తప్పులను పెద్దగా పట్టించుకోకుండా ఉదారంగా మార్కులు ఇస్తారు. వీరికి అవసరమైన పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ప్రత్యేక సమాధాన పత్రాలను ఇస్తారు. వీరికి కూడా స్క్రైబ్ ను అదనపు సమయాన్ని ఇస్తారు. వినికిడి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారు. మూల్యాంకనంలో తప్పులను పెద్దగా పట్టించుకోరు. మాటలోపం భాషావైకల్యం ఉన్న దివ్యాంగులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 20 శాతానికి తగ్గించారు. ఆటిజం ఉన్న దివ్యాంగులకు ఉత్తీర్ణత శాతం మార్కులను 10 శాతానికి తగ్గించారు. వీరికి కూడా ప్రత్యేక సమాధాన పత్రాలు ఇస్తారు. అలాగే మానసిక స్థితి సరిగా లేని దివ్యాంగులకు ఉత్తీర్ణత మార్కులను 35 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారు. వీరి సమాధానాల్లో కూడా భాషా దోషాలను పట్టించుకోరు. ఈ విద్యార్థులు తమకు అవసరమైన పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లేందుకు అక్కడ వినియోగించేందుకు అనుమతి ఇస్తారు. వీరికి ఒక భాషా పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ టీ కామేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు వివరించారు.

ఆదర్శపాఠశాలలో ప్రవేశానికి..

మర్రిపాడు: నందవరంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పీ లక్ష్మీనారాయణ తెలిపారు. అర్హులైన వారు మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష ఫీజుగా ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 63006 03066కు నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వివాదాస్పదంగా ఇనాం భూమి



వివాదాస్పద ఇనాం భూమి

సీతారామపురం: మండలంలోని దేవిశెట్టిపల్లిలో సర్వే నంబరు 86-3లో ఉన్న 2.86 ఎకరాల మాదిగ ఇనాం భూమి వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ భూమిపై కన్నేసిన సమీపంలోని మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఇర్ల నాగయ్య అనే వ్యక్తి రికార్డులు తారుమారు చేసి నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను ప్రలోభపెట్టి పాస్‌పుస్తకాలు పొంది ఆక్రమించుకున్నాడని దేవిశెట్టిపల్లివాసులు ఆరోపిస్తున్నారు. ఈ భూమి విషయంలో దేవిశెట్టిపల్లి వాసులంతా ఏకమై సర్పంచ్ రమాదేవి ఆధ్వర్యంలో సీతారామపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద పలుమార్లు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికార యంత్రాంగానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణదారులు తమ తెలివితేటలు ప్రదర్శిస్తూ ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం కళ్లుగప్పి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణదారుడు ఇనాం భూమికి కంచె వేయడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం మంజూరు చేయించుకున్నారని దేవిశెట్టిపల్లి వాసులు ఆరోపిస్తున్నారు. ఇనాం భూమికి విముక్తి కల్పించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఆక్రమణదారుడికి అభయహస్తం ఇవ్వడంలో గల ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు నవీన్‌కుమార్‌రెడ్డి, నరసింహారావు సూచించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. నిత్యం పీహెచ్‌సీకి 50 నుంచి 100 మందికి పైగా జ్వర పీడితులు వస్తున్నారని చెప్పారు. పారిశుధ్యం లోపం, దోమల కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రజలు పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగితే వ్యాధులు దరిచేరవన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు.

చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు



సోమశిల: అనంతసాగరం మండలంలోని శంకరనగరం, రేవూరు, దేవరాయపల్లి, కామిరెడ్డిపాడు, తదితర గ్రామాల్లోని చెరువుల్లోని చేపలకు చికెన్ వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలను మేతగా వేయడం నిషిద్ధం. అయినప్పటికీ చెరువులను పాడుకున్న వారు సుదూర ప్రాంతాల నుంచి మినీవ్యాన్ల ద్వారా డ్రమ్ముల్లో తీసుకొచ్చి మేతగా వేస్తున్నారు. చెరువుల్లో చికెన్ వ్యర్థాలను వేయడం వల్ల జలాలు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రోడ్లపై చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాలు వెళ్లే సమయంలో దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చికెన్ వ్యర్థాల తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు



చేజర్ల: మండలంలోని మడపల్లిలోని వాటర్ ట్యాంకు సమీపంలో రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. ఇక్కడ రోడ్డుపైన మురుగు ప్రవహిస్తోంది. ఈ కారణంగా రోడ్డు దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవనాల ప్రారంభోత్సవమెన్నడో..?



ప్రారంభోత్సవానికి నోచుకోని సత్యవోలులోని విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం



గరిమెనపెంటలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- ఎన్నికల కోడ్ రావడంతో ఆగిన ప్రారంభోత్సవాలు
- నేటికి పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా భవనాలు



పార్లపల్లి నిర్మించిన సచివాలయ భవనం

కొండాపురం : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామసచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటి ముంగిటకే అందించే సంకల్పంతో లక్షలాది రూపాయలు వెచ్చించి అత్యాధునిక వసతులతో సచివాలయ భవన నిర్మాణాలను చేపట్టారు. వాటికి అనుబంధంగా రైతులకు సేవలు అందించేందుకు రైతుభరోసా కేంద్రాలు, ప్రజలకు ఆరోగ్య సేవలను అందించేందుకు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను నిర్మించారు. అయితే కొన్ని చోట్ల భవన నిర్మాణాలను ప్రారంభించగా, మరికొన్ని చోట్ల ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణాలు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భవనాలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. కొండాపురం మండలంలో 19 పంచాయతీలు ఉండగా 13 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయంతో పాటు రైతుభరోసా కేంద్రం, విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. చింతలదేవిలో మినహా మిగిలిన పన్నెండు చోట్ల మూడు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌లు సైతం భవనాలను పంచాయతీలకు అప్పగించారు. అంతలో ఎన్నికల కోడ్ రావడంతో భవన నిర్మాణాలు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాల ప్రారంభోత్సవాన్ని పట్టించుకోలేదు. దీంతో సాయిపేట, కొమ్మి, సత్యవోలు, కొత్తపేటలోని సచివాలయ భవనాలను అధికారులే నామమాత్రంగా ప్రారంభించి సేవలను కొనసాగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. విలేజ్ హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాల తాళాలను మాత్రం ఇంకా తీయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తునా భవనాలను నిరుపయోగంగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని జీర్ణించుకోలేక స్థానిక కూటమి నేతలు ప్రారంభోత్సవాలకు అడ్డుపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భవనాలను త్వరలో ప్రారంభిస్తాం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరు కాంట్రాక్టర్లు సచివాలయ భవనాలను పంచాయతీలకు అప్పగించారు. వాటిలోనే పాలన సాగిస్తున్నాం. మిగిలిన వాటిని ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

– ఆదినారాయణ, ఎంపీడీఓ

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అల్లూరు/సోమశిల/అనుమసముద్రంపేట: అల్లూరు, అనంతసాగరం, అనుమసముద్రంపేట మండల తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, సుభాషిణి, శ్రీరామకృష్ణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచి రసీదులను అందజేయనున్నట్లు తెలిపారు. సమస్యను సంబంధిత అధికారి ద్వారా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులందరూ విధిగా హాజరుకావాలి

సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఇక నుంచి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రతి అధికారి పాలు పంచుకోవాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేస్తే పరిష్కారం చూపుతామన్నారు. ఇకపై ఎవరైనా అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.